సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



అ'విశ్రాంత' సేవలు !

సమాజ సేవలో సీనియర్ సిటిజన్స్ ముందుంటున్నారు. ఆరు పదుల వయస్సు లోనూ మేము సైతం అంటూ ఇతరులకు సహాయపడుతున్నారు. - 8లో



రికార్డు స్థాయిలో హార్సిలీహిల్స్ గేటు వేలం

హార్సిలీహిల్స్ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా టౌన్‌షిప్ కమిటీకి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.540	రూ.640
రెండోరకం	రూ.400	రూ.520

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 126 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు రాజంపేటలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

రాజంపేట టౌన్ : రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సెంటర్ హాల్‌లో మంగళవారం ఉదయం 9-30 గంటల నుంచి అండర్-19 రాష్ట్రస్థాయి కరాటే పోటీలు జరుగుతాయని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ.రమణరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు.ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరి శారద ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యాయామ విద్య తనిఖీ అధికారి జీ.భానుమూర్తిరాజు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అ.దికారి ఎస్.రవి, వైఎస్సార్‌జిల్లా ఒకేషనల్ అధికారి వెంకటసుబ్బయ్య, అన్నమయ్యజిల్లా డీఐఈఓ ఎం.కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు.

రాయచోటి నుంచి తిరుమలకు కొత్త బస్సు సర్వీసులు



పీలేరు డిపో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం రాము

పీలేరురూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం రాయచోటి నుంచి తిరులకు రెండు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డీపీటీవో రాము తెలిపారు. సోమవారం పీలేరు ఆర్టీసీ డిపోను ఆయన తనిఖీ చేశారు. డిపో కార్యాలయంలో మరుగుదొడ్లను ఉద్యోగుల విశ్రాంత గదులను పరిశీలించి పరిశుభ్రంగా లేవని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మదనపల్లె డిపోలో ఒక పెట్రోల్ బంకు నడుస్తోందని, రాజంపేట డిపోలో త్వరలో మంత్రి చేతుల మీదుగా మరో పెట్రోల్ బంకు ప్రారంభిస్తామన్నారు. జిల్లాకు 40 కొత్తబస్సులు రావల్సి ఉండగా 14 వచ్చినట్లు తెలిపారు. కలకడ బస్టాండులో మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్, ఏడీసీ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయలో సోమవారం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లను రంగు రంగుల పూలు,పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. పల్లకీలో కొలువుదీర్చారు. మాఢవీధుల్లో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు కృష్ణయ్య, శంకరయ్యలు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కబడ్డీ జట్టు ఎంపిక

రాయచోటి టౌన్ : జిల్లా స్థాయి అండర్ -17 కబడ్డీ జట్టు ఎంపికలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, వసంతలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామాపురం మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి ఎంపికలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు తమ విద్యార్థులను తీసుకరావాలని కోరారు.

గడువులోగా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులకు నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలని పోలీస్ అధికారులకు ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిచ్చి సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

వైఎస్ జగన్ హయాంలో
ఆలయం..దేదీప్యమానం

- కొత్తశోభను సంతరించుకున్న పలు ఆలయాలు
- జీర్ణోద్ధరణకు భారీగా నిధుల కేటాయింపు
- సౌకర్యాల కల్పనకు పెద్దపీట
- వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

ఒకప్పుడు దీప, దూప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలకు జగన్ ప్రభుత్వ హయాంలో మహర్దశ చేకూరింది. కొత్తవి నిర్మించడంతోపాటు శిథిలావస్థలో ఉన్న వాటి జీర్ణోద్ధరణకు విరివిగా నిధులు మంజూరయ్యాయి. దీంతో జిల్లాలోని అనేక ఆలయాలు దేదీప్యమానంగా వెలుగొందాయి. ఫలితంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు సమకూరాయి. ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. తమ ఇష్ట దైవాలను దర్శించుకొని ఆ భగవంతుడి సన్నిధిలో ప్రశాంతత పొందే విధంగా ఆలయ అభివృద్ధికి జగన్ పాలనలో చేసిన కృషికి జిల్లావాసులు,భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అన్నమయ్య థీంపారులోని పూర్తైన శ్రీవారి ఆలయం

రాజంపేట : నియోజకవర్గంలోని దేవాలయాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహర్దశ కలిగింది. పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి అయిన తాళ్లపాక అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో శ్రీకారం జరిగింది. తర్వాత వచ్చిన పాలకులు తాళ్లపాకను మరిచిపోయారు. నిర్లక్ష్యం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టీటీడీ చైర్మన్లు వైవీసుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధికి నడుంబిగించారు.

అన్నమయ్య థీంపార్కులో శ్రీవారి ఆలయం పూర్తి

అన్నమయ్య 108 అడుగుల విగ్రహ ప్రాంతంలో శ్రీవారి ఆలయం నిర్మితం చేస్తామని దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. మళ్లీ ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత శ్రీవారి ఆలయం నిర్మాణానికి అంకుర్పారణ జరిగింది. ప్రస్తుతం శ్రీవారి ఆలయం నిర్మాణం పూర్తయింది. అయితే నేటి పాలకులు శ్రీవారి ఆలయం ప్రారంభోత్సవం విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నమాచార్యుని జన్మస్థలి తాళ్లపాకలో శిథిలావస్థలో ఉన్న అన్నమాచార్య ధ్యానమందిరాన్ని పునరుద్ధరించాలని బోర్డులో తీర్మానించారు. ఈ క్రమంలో రూ.2కోట్ల నిధులను కేటాయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధ్యానమందిరం పునరుద్ధరణను ఆటకెక్కించారు.

చిన్నమండెం మండలంలో..

చిన్నమండెం మండలంలోని దేవగుడిపల్లె గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి రూ.1.25 కోట్లు, మల్లూరమ్మ ఆలయానికి రూ.98 లక్షలు, కొత్తపల్లి గ్రామంలోని శ్రీ కోదండ రామాలయానికి రూ.50 లక్షలు, రామాలయంలో కల్యాణ మండపానికి రూ.39.60 లక్షలు వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేసింది.

మదనపల్లెలో..

శ్రీవాణి ట్రస్టు కింద 9 ఆలయాలను అభివృద్ధి చేశారు. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున రూ.90 లక్షలు విడుదల చేసి అభివృద్ధి చేశారు. సీజీఎఫ్ ఫండ్ కింద 2022-23 మదనపల్లె మండలం కాకరకాయలపల్లెలోని శ్రీ ఆంజనేయస్వామి పునః నిర్మాణానికి రూ.4,640,00 నిధులు విడుదల చేశారు. నిమ్మనపల్లె మండలం నేలమల్లేశ్వరయస్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు విడుదల చేశారు. బొంతలవారిపల్లెలో వీరభద్రస్వామి ఆలయంలో రూ.9 లక్షలతోఆలయ పునః నిర్మాణ పనులు చేపట్టారు.

• రాజగోపురం. రాజసం



ఆలయ పశ్చిమ దిక్కున నిర్మించిన మాఢవీధి



నూతనంగా నిర్మించిన పశ్చిమ రాజగోపురం

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సహకారం అందించింది. ఆలయ విమాన గోపురం పిడుగుపాటుకు గురికావడంతో నెర్రెలు బారాయి. దీంతో అప్పటి ప్రభుత్వం వెంటనే స్పందించడంతో 2020-2021లో రూ.33లక్షలతో విమాన గోపురం నిర్మించారు. ఇది కూడా కేవలం ఆరు నెలల కాల వ్యవధిలో నిర్మించి పూర్తిచేశారు. అలాగే ఐదు అంతస్తుల పశ్చిమ రాజగోపురాన్ని సీజీఎఫ్ నిధులు 1.50 కోట్లతో నిర్మించారు. ఎన్నో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని మాఢవీధులను కూడా మున్సిపల్ నిధులు రూ38 లక్షలతో అభివృద్ధి చేశారు. దీంతోపాటు ఆలయ అర్చకులు, ఉద్యోగులకు కూడా వేతనాలు పెరిగాయి.

• రూ.7.67 కోట్లతో 9 ఆలయాల జీర్ణోద్ధరణ



పూర్తయిన మల్లికార్జునస్వామి ఆలయం

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఆలయాల అభివృద్ధి జరిగింది. 2019 నుంచి 2024 వరకు ఆలయాల జీర్ణోద్ధరణ పనుల కోసం రూ.7.67 కోట్లు కేటాయించారు. ఆరు మండలాల్లోని ప్రాచుర్యం కలిగిన 9 ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేశారు. వాటికి నిధులు మంజూరు, పనులు పూర్తి చేయించడంలో సహకారం అందించారు. తంబళ్లపల్లె ఆలయం మల్లికార్జునస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను రూ.3.15 కోట్లతో పూర్తి చేశారు. నియోజకవర్గంలో చేపట్టిన ఆలయాల పనులు దాదాపుగా పూర్తయ్యాయి. బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.40 లక్షలు, తంబళ్లపల్లె మల్లయ్యకొండకు రూ.3.15 కోట్లు, ములకలచెరువు మండలం పాత ములకలచెరువులోని ప్రసన్న మల్లికార్జునస్వామి ఆలయానికి రూ.1.56 కోట్లు, పెద్దతిప్పసముద్రం మండలంలోని మల్లేశ్వరస్వామి ఆలయానికి రూ.36 లక్షలు, తంబళ్లపల్లె మండలంలోని పార్వతిదేవత ఆలయానికి రూ.45 లక్షలు, ఏనుగుమల్లమ్మ ఆలయానికి రూ.28 లక్షలు, ఆంజనేయస్వామి ఆలయానికి రూ.25 లక్షలు, గణపతిస్వామి ఆలయానికి రూ.25 లక్షలు, లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.97 లక్షలు మంజూరు చేశారు.

• టీటీడీలోకి విలీనం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నందలూరులో చోళుల కాలం నాటి సౌమ్యనాథాలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంలోకి విలీనం చేశారు. దీంతో ఆలయం అభివృద్ధిబాట పెట్టింది. ప్రత్యేకంగా స్వామి వారికి తిరుమల తరహాలో నైవేద్యాలు, పూజలు నిర్వహిస్తున్నారు.

• విగ్రహం..ప్రత్యేకం..



ఒంటిమిట్ట కోదండరామాలయానికి ల్యాండ్ మార్క్‌గా జాంబవంతుని విగ్రహం నిలిచిపోనుంది. రాములోరి కల్యాణవేదిక ప్రాంగణంలో 54 అడుగుల జాంబవంతుని విగ్రహం విగ్రహం ఏర్పాటుచేశారు.దీని నిర్మాణం కోసం రూ.40లక్షల నిధులు కేటాయించింది.

• గలగలా నిధులు..



శ్రీవరదరాజుల దేవస్థానం, చిట్వేలి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలిలో 14,16 శతాబ్దంలోని శివాలయాలు ఉన్నాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆలయాల అభివద్ధికి నిధులు మంజూరు చేశారు. పెనగలూరు మండలం నారాయణ నెలూరుగ్రామంలోని మూలస్థానేశ్వరుడి ఆలయానికి రూ. 2 కోట్ల 3లక్షలు, ఈటిమానుపురంలోని భరద్వాజ స్వామి గుడికి రూ.4కోట్ల 8లక్షలు, కొండూరులోని చెన్నకేశవస్వామి దేవస్థానానికి రూ. 5 కోట్ల 3లక్షలు, పొందలూరులోని వరదరాజ స్వామి గుడికి రూ. 6కోట్ల 4లక్షలు, చిట్వేలి మండలంలోని సీతారామస్వామి గుడికి 9లక్షలు మంజూరు చేశారు.

నల్లగంగమ్మ ఆలయం.. సర్వాంగ సుందరం



సంబేపల్లె మండలంలో నూతనంగా నిర్మించిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. శ్రీదేవరరాయినల్లగంగమ్మ ఆలయానికి రూ. కోటి 20లక్షలు, సంబేపల్లె శ్రీపశుపతినాథాలయానికి రూ. 1 కోటి 22 లక్షలు, దేవపట్లమ్మ ఆలయానికి రూ. కోటి 20 లక్షలు, శెట్టిపల్లె శ్రీ లక్ష్మీనరసింహస్వామి రూ. కోటి 50లక్షలు , గుట్టపల్లె అంకిరెడ్డిగారిపల్లె రామాలయానికి రూ.10లక్షలు ,గంగమ్మ రూ.10 లక్షలు , నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ బండకాడమాదిగపల్లె రామాలయానికి రూ10 లక్షలు, గోరావాండ్లపల్లె పోలేరమ్మ గుడికి రూ. 10లక్షలు, డి పోతువాండ్లపల్లె రామాలయానికి రూ.10 లక్షలు, దేవపట్ల రెడ్డివారిపల్లె మాలపల్లె రామాలయం రూ.10 లక్షలు, రౌతుకుంట రామాలయం రూ.10 లక్షలు, ఐఎస్‌కాలనీ నగరి రామాలయానికి రూ.10లక్షలు, శెట్టిపల్లె పెద్దబిడికిలో ముత్తుమారెమ్మ గుడికి రూ.26 లక్షలు, రామాలయానికి రూ. 25 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో కొన్ని ఆలయాలు పూర్తయ్యాయి.



మండల కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న శ్రీ పశుపతినాథాలయం

వివాదాస్పదంగా మారుతున్న
ఉన్నతాధికారి తీరు!

- బంగ్లాలో ఆఫీసు పనులు
- రాని వారికి నోటీసులు

రాజంపేట : ఆయన డివిజన్ కేంద్రంలోని ఓ ఉన్నతాధికారి. ఇటీవల ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఇంతలోనే ఆయన తీరు వివాదానికి దారితీసింది. వివరాల్లోకి వెళితే...తాను బంగ్లాలో ఉంటాను. ఉదయం 5గంటలకే సిబ్బంది రావాలని హుకుం జారీచేశారు. అయితే మహిళా సిబ్బంది 5గంటలకు వెళ్లాలంటే జంకుతున్నారు. తాము కార్యాలయం పెట్టుకొని బంగ్లాకు ఎందుకు వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. కొందరు మహిళ సిబ్బంది తమకు పెట్టిన ఈ నిబంధన గురించి మీడియా ఎదుట వాపోయారు. వారు ధైర్యంగా చెప్పడానికి వెనుకంజ వేశారు. తాను చెప్పిన విధంగా రాని వారికి నోటీసులు ఇవ్వాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు కూడాజారీ చేసినట్లు తెలిసింది. ఈ ఉన్నతాధికారి విషయం టౌన్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.

గతంలో పనిచేసే ప్రదేశంలో...

ఇక్కడి రాకముందు గతంలో పనిచేసిన ప్రాంతంలో కూడా ఈ ఉన్నతాధికారి వివాదంలో చిక్కుకున్నారు. మహిళలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లిన సందర్భంలో ఆయన నడుచుకున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెలువెత్తిన సంగతి తెలిసిందే. అక్కడ రాత్రి 9గంటల తర్వాత ఫిర్యాదుదారులైన మహిళలతో మాట్లాడే అంశం వివాదానికి దారితీసింది. బాధితురాలు ధర్నాకు దిగంది. ఈ విషయం మీడియాలో వచ్చిన విధితమే. అక్కడి నుంచి ఆయనపై బదిలీవేటు పడింది.

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



క్రీడలను ప్రారంభిస్తున్న అతిథులు

రాయచోటి టౌన్ : మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్లు జగదీశ్వరయ్య, మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అండర్-17, అండర్-14 రెండు విభాగాలుగా విభజించి మొత్తం నాలుగు టీంలను ఎంపిక చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్, కమిటీ చైర్మన్ సుగవాసి ఆనందబాబు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, గంగులయ్య, రవీంద్ర రాజు, వేణుమాధవ రాజు, సుబ్రహ్మణ్యం, రవీంద్రనాథ్ రాజు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వరమే పరిష్కారం

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



వినతులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ వందశాతం జరగాలి

అక్టోబర్ ఒకటో తేదిన వందశాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్లు, డీపీఓ, ఎంపీడీఓలు, డీఎల్‌డీఓలతో పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై సమీక్షించారు. సెప్టెంబర్ 30వ తేదీ సాయంత్రం నగదు మొత్తాన్ని బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకోవాలని సూచించారు. అందుబాటులో లేనివారు, ఆసుపత్రులలో చికిత్స తీసుకుంటున్నవారు తప్ప మిగతా 99 శాతం పింఛన్లు అందుకోవాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి పంపిణీ మొదలు పెట్టాలన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సంయుక్త కలెక్టర్, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాలలో స్వల్ప మార్పులు, చేర్పులు

రాజకీయ పార్టీల అభిప్రాయాలు, నిబంధనల మేరకు అన్నమయ్య జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (స్వల్ప మార్పులు, చేర్పులు) చేయబోతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన ఓటర్ల సవరణ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ నరసింహకుమర్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. జిల్లాలో నేటితో ఓటర్ల సవరణపై ఇంటింటికి వెళ్లి సర్వేచేసే ప్రక్రియ పూర్తయిందన్నారు. అన్నమయ్య జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రాజంపేటలో ఒక నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు, రాయచోటిలో ఎనిమిది పోలింగ్ కేంద్రాల స్థానం మార్పు, తంబళ్లపల్లిలో ఒక పోలింగ్ కేంద్రం పేరు మార్పు, మదనపల్లి నియోజకవర్గంలో రెండు పోలింగ్ కేంద్రాల స్థానం మార్పు తదితర అంశాలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై నివేదికను కేంద్ర ఎన్నికల సంఘం వారికి త్వరలో పంపుతున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లె : సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. నక్కలదిన్నె తాండాలో సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. స్థానికంగా ఉన్న భీమ్లానాయక్ భార్య కళావతి (42) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

పోలీసు ఉద్యోగం ఉన్నతమైంది



ఉద్యోగులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి టౌన్ : సమాజంలో ఎంతో ఉన్నతమైన ఉద్యోగం పోలీసు ఉద్యోగమని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని కానీ సమాజానికి మనం చేసే సేవలు శాశ్వతమన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారిలో ఎస్ఐ పి. వెంకటరమణ, ఏఎస్ఐ హెచ్ఎండీ కాలేషా, ఏఎస్ఐ సుధాకర్ బాబు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఓ ఆర్ఐ ఎం. పెద్దయ్య, ఉద్యోగ విరమణ చేసిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాలేపాడు గ్రామ సచివాలయం ఆచూకీ చెప్పండి

మదనపల్లె : మదనపల్లె మండలం మాలేపాడు గ్రామసచివాలయం కనిపించడం లేదని, పోలీసులు వెతికిపెడితే తమ సమస్యలు చెప్పుకుంటామని ఓ వ్యక్తి తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసిన ఘటన సోమవారం జరిగింది. మాలేపాడు పంచాయతీ కొత్తూరుకు చెందిన యర్రంనాయుని చంద్రశేఖర్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో 28.6.2024న దేవళంపల్లె నుంచి మాలేపాడు పంచాయతీ ఆఫీసుకు మార్చారన్నారు. ప్రస్తుతం పంచాయతీ ఆఫీసులోనూ సచివాలయం లేదని, అక్కడ ఉన్న వారిని విచారిస్తే, ఎవరూ సక్రమంగా వివరాలు చెప్పలేదన్నారు. దీంతో సచివాలయం ఎక్కడకు మార్చారో తెలియక తిరిగి రావాల్సి వచ్చిందన్నారు. పోలీసువారు దయ ఉంచి సచివాలయం ఆచూకీ కనిపెట్టి, ప్రజలందరికీ సౌకర్యంగా ఉండేలా దేవళంపల్లెలో నిర్మించిన నూతన భవనంలోకి మార్పించి ఇవ్వాల్సిందిగా ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నాడు. సచివాలయం కనిపించడం లేదంటూ తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

నకిలీ పత్రాలతో భూమి ఆక్రమణకు యత్నం

మదనపల్లె : తాతల కాలం నుంచి తమ కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉంటూ వారసత్వంగా వచ్చిన భూమిని కొందరు నకిలీ పత్రాలతో కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయండని చుండుపల్లె నాగేంద్రబాబు తహసీల్దార్ ఖాజాబీకి ఫిర్యాదు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీని అందజేశాడు. ఈ సందర్భంగా బాధితుడు చుండూరు నాగేంద్ర మాట్లాడుతూ... పట్టణంలోని రెడ్డీస్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లోని సర్వే నంబర్.155/3లో 2.41 ఎకరాలు, 155/4లో 0.47 సెంట్లు, 155/5లో 0.37 సెంట్లు, 158/2లో 0.22 సెంట్లు భూమి తన ముత్తాత చుండుపల్లి గంగులప్ప పేరుమీద డి-ఫారం పట్టా, పాసుపుస్తకాలు ఉన్నాయన్నారు. అందులో వంక పోరంబోకు పోను మిగిలిన భూమి తమ ఆధీనంలోనే ఉందన్నారు. అయితే ఈ భూమికి సంబంధించి సుండుపల్లి రెడ్డెప్ప అనే వ్యక్తి నకిలీపత్రాలు సృష్టించి కాజేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. దీంతో తాము కోర్టును ఆశ్రయించి, డాక్యుమెంట్లు సమర్పిస్తే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ప్రస్తుతం తిరుపతికి చెందిన కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలతో మొత్తం భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయాడు. తమ భూమి అన్యాక్రాంతం కాకుండా న్యాయం చేయాల్సిందిగా వేడుకున్నాడు.

అ‘విశ్రాంత’ సేవలు!



ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ నాయకులు (ఫైల్)

- సమాజ సేవలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్
- ఆరు పదుల వయస్సులోనూ మేముసైతం అంటున్న వైనం
- నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

మదనపల్లె సిటీ : మనిషి జీవన చక్రంలో వచ్చే మార్పులు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతి వ్యక్తి తుది శ్వాస ఉన్నంత వరకు.. ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలనే కోరుకుంటాడు. కుమారుడిగా, కూతురిగా, నాన్నగా, అమ్మగా జీవితాంతం కష్టపడి పని చేసి చివరకు వృద్ధాప్య దశకు చేరుకుంటారు. తన కుమారులకు, కూతుళ్లకు, మనుమళ్లకు, మునిమనుమలకు సలహాలు ఇచ్చే వయస్సు కూడా ఇదే. అలాంటి వయస్సులో ప్రతి ఒక్కరూ ఏ కష్టం నష్టం లేకుండా హాయిగా జీవించాలని పరితపిస్తుంటారు. అందు కోసం అనుక్షణం ఆరాటపడుతుంటారు. అయితే వీరు మాత్రం అందుకు భిన్నంగా...రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించి... సమాజ సేవలో మేము సైతం అంటూ ఇతరులకు సహాయపడుతూ ముందుకు సాగుతున్నారు.

సాధారణంగా 60 ఏళ్లు దాటాక కృష్ణా.. రామా...అంటూ ఓ మూలన కూర్చోకుండా స్వీట్-16లా యువకులతో పోటీపడుతూ సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటున్నారు. వృద్ధాప్యం తమకు భారమో, శాపమో కాదని నిరూపిస్తున్నారు కొందరు వృద్ధులు. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరులో ఏపీ సీనియర్ సీటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఉన్నాయి. ఈ అసోసియేషన్లు సీనియర్ సిటిజెన్స్ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్నాయి. మదనపల్లెలో ప్రత్యేకంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సమస్యల పరిష్కారమే..

సమస్యల పరిష్కారమే పరమావధిగా ఏపీ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. ప్రతి నెల రెండో ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమావేశంలో వచ్చిన వృద్ధుల సమస్యలను తెలుసుకుని వారికి సలహాలు, సూచనలను అందజేస్తున్నారు.

సేవా కార్యక్రమాలు..

- పేద, ధనిక అనే వ్యత్యాసం లేకుండా 60 ఏళ్లు దాటిన వారికి ఆరోగ్య సలహాలు ఇవ్వడం, వారిలో నూతనోత్సాహం కల్పించేలా కృషి చేస్తున్నారు.
- ఉచిత ఆరోగ్య శిబిరాలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తున్నారు.
- తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలేసే పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి తరచూ వారు కలిసి ఉండేలా చూస్తున్నారు.
- ఆస్తి తగాదాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఆయా కుటుంబాలకు రాజీ కుదిరిస్తున్నారు.
- బ్యాంకులలో సీనియర్ సిటిజెన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని మేనేజర్లను సంప్రదిస్తున్నారు.
- ఆర్టీసీ బస్సులు, రైల్వేలలో సీనియర్ సిటిజెన్స్‌కు రిజర్వేషన్ విషయం ఆయా డిపో మేనేజర్లు, రైల్వే అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు.
- మొక్కలు నాటడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.
- వృద్ధుల బాధితుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళుతున్నారు.

విస్తృతం చేస్తున్నాం



సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ద్వారా సేవలు విస్తృతం చేస్తున్నాం. పాఠశాల స్థాయి విద్యార్థులకు తల్లిదండ్రులు, వయో వృద్ధుల విలువల గురించి తెలియజేయాలి. ప్రతి నెలా అసోసియేషన్ సమావేశం నిర్వహించి సేవా కార్యక్రమాలపై చర్చించుకుంటాం. అందుకు అనుగుణంగానే ముందుకు సాగుతున్నాం.

-ఎస్.మునిగోపాలకృష్ణ, సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

11 మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- పరారీలో ప్రధాన నిందితుడు
- 12 దుంగలు, ఆటో స్వాధీనం



ఎర్రచందనం స్మగ్లర్ల వివరాలను వెల్లడిస్తున్న కడప అటవీశాఖ రేంజ్ అధికారి కె. ప్రసాద్

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగు సెక్షన్ రసూల్‌పల్లి బీట్ ప్రాంతంలో ఎర్రచందనాన్ని ఆటోలో లోడింగ్ చేస్తున్న 11 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేశామని కడప ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె. ప్రసాద్ తెలిపారు. సోమవారం కడప నగరం చెన్నూరు బస్టాండ్ సమీపంలోని కడప రేంజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం వంగిమల గ్రామానికి చెందిన ముక్కెర వెంకటరామిరెడ్డి అనే ఆటో డ్రైవర్‌తో పాటు మరో 10 మంది మద్దిమడుగు అటవీ ప్రాంతంలోకి వెళ్లి అక్కడ ఎర్రచందనం చెట్టు నరికి వాటిని దుంగలుగా మార్చారన్నారు. ఆదివారం రాత్రి 12 ఎర్రచందనం దుంగలు ఆటోలో లోడింగ్ చేసి రవాణాకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. జిల్లా అటవీశాఖాధికారి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడైన వెంకటరామిరెడ్డి పరారయ్యాడని అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాచపల్లిలోని వంగిమల్లకు చెందిన రాయచోటి రామ, రాయచోటి రాచన్న, శ్రీనివాసులు, షేక్ అల్లాబకాష్, గట్టుపల్లి వెంకటరమణ, రాయచోటి రాచరాయుడు, శేఖర్, షేక్‌షావలి, గంగనేరు నీలకంఠరావు, షేక్ అల్లా, షేక్ షఫీవుల్లా, రాచరాయుడులను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి 12 ఎర్రచందనం దుంగలు, ఆటోను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అన్యాయంగా అక్రమ కేసులు పెడుతున్నారు



మాట్లాడుతున్న మినుకు రత్నమ్మ

రాజంపేట : కూలిపనులు చేసుకునేవాళ్లం.. మాకు రాజకీయాలు తెలియవు.. కానీ అన్యాయంగా తమపై అక్రమ కేసులు పెడుతున్నారు.. అని టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు మందా శ్రీనివాసులు చేతిలో దౌర్జన్యానికి గురైన బాధితురాలు మన్నూరు అరుంధతీవాడకు చెందిన మినుకు రత్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మున్సిపాలిటీ పరిధిలోని మన్నూరు అరుంధతీవాడలో తాము రాళ్లు, కట్టెలతో దాడి చేసినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అధికార దుర్వినియోగంతో తమ సంబంధీకులపై అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. టీడీపీ నేత మందా శ్రీనివాసులు దౌర్జన్యం చేసి తోసేయడంతో కిందపడి, ఇంటిలో మంచానికి పరిమితమైన తనను బయట ప్రాంతంలో ఉన్న కొడుకు వచ్చి స్థానిక ప్రాంతీయ వైద్యశాలకు తరలించాడన్నారు. నగిరిపాటి ప్రకాశ్‌కు రూ.25వేలు అప్పుగా ఇచ్చామన్నారు. ఆ డబ్బులు అడిగేందుకు వెళ్లినప్పుడు, మందా శ్రీనివాసులు తమపై దౌర్జన్యంగా వ్యవహరించాడన్నారు. దీంతో తమకు సంబంధించిన ఇద్దరు మహిళలు, ఒక యువకుడు అడ్డుకున్నారన్నారు. దానికి తిరిగి తామే రాళ్లతో, కట్టెలతో దాడి చేసినట్లుగా, పైగా వైఎస్సార్ సీపీ నాయకులమని కల్పించి మీడియాలో చూపించారని పేర్కొంది. కూలీ, నాలీ చేసుకొని జీవించే తమకు రాజకీయాలు ఎందుకు అంటగడతారని వాపోయింది. జిల్లా ఎస్పీ తమకు న్యాయం చేయాలని ఆమె మొరపెట్టుకుంది.

భార్యపై అనుమానంతో మత్స్యకారుడు ఆత్మహత్య



మహంకాళి (ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని సోమశిల వెనుకజలాల ప్రాంతమైన కుడమలూరులో రెండు రోజుల క్రితం విశాఖపట్నంకు చెందిన ఓసిపల్లి మహంకాళి(40) అనే వ్యక్తి సోమశిల వెనుక జలాలలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు మూడు నెలల క్రితం విశాఖపట్నం, పెంటకోట నుంచి చేపలు పట్టేందుకు ఓసిపల్లి మహంకాళి భార్య, బిడ్డలతో కలిసి మండల పరిధిలోని సోమశిల వెనుక జలాలు ఉన్న ప్రాంతమైన కుడమలూరులోగల చీమల తిప్ప వద్ద నివాసం ఉంటున్నాడు. గత కొంత కాలంగా తన భార్యపై అనుమానం ఉండటంతో ఈనెల 27వ తేదిన మనస్తాపం చెంది చాపల వేటకు వెళ్లొస్తానంటూ వెళ్లి సోమశిల వెనుకజలాల్లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు తెలిపారు. అప్పటి నుంచి మృతదేహం కోసం వెతుకుతుండగా ఆదివారం సోమశిల వెనుక జలాలలో మహంకాళి మృతదేహం బయటపడింది. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పని పూర్తి చేయలేదని పెయింటర్‌పై దాడి

మదనపల్లె : ఇంటి పెయింటింగ్ పనులు సకాలంలో పూర్తి చేయలేదని పెయింటర్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. దుబ్బిగానిపల్లె పంచాయతీ ఎనుమలవారిపల్లెకు చెందిన అరుణ్‌కుమార్ (38) పెయింటర్‌గా పని చేస్తాడు. మదనపల్లెకు చెందిన ఇర్ఫాన్ ఇంటి పెయింటింగ్ పనులు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో బెంగళూరు బస్టాండు సమీపంలో అరుణ్‌కుమార్ ఉండగా అతనిపై దాడి చేసి కొట్టాడు. దీంతో స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తనను కులం పేరుతో దూషించి కొట్టాడని బాధితుడు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

పెద్దమండ్యం : పట్టపగలు ఓ ఇంట్లోకి చొరబడిన దొంగలు బంగారం, నగదును దోచుకొనిపోయారు. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ ధనరాజుగారిపల్లెలో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ధనరాజు శ్రీనివాసులు వ్యవసాయ పనులు చేసుకుని, గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. రోజువారీ పనులలో భాగంగా భర్త గొర్రెల పోషణ కోసం వెళ్లగా, భార్య ఆటోలో పల్లెలోని సహచర కూలీలతో కలిసి టమాటా పంట పనులకు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ద్విచక్రవాహనంలో వచ్చిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 40 గ్రాముల బంగారం, రూ. 50 వేల నగదును తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఇంట్లో దొంగతనం చేసుకుని ద్విచక్రవాహనంలో వేగంగా వెళుతున్న వారిని సమీపంలో టమాటా కాయలు కోస్తున్న గ్రామస్తులు పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే దొంగలు అతి వేగంగా ఎఫ్‌జెడ్ ద్విచక్రవాహనంలో వెళ్లిపోయారని గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ పి వి రమణ, ఏఎస్ఐ వెంకటస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంటనే వేలిముద్రల నిపుణులను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రికార్డు స్థాయిలో హార్సిలీహిల్స్ గేటు వేలం

రూ.45లక్షల 20వేలకు పాట దక్కించుకున్న అనిల్‌కుమార్ నాయుడు



హార్సిలీహిల్స్ గేటు వసూళ్లకు సబ్ కలెక్టరేట్‌లో వేలం పాటలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : హార్సిలీహిల్స్ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా టౌన్‌షిప్ కమిటీకి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. హార్సిలీ కొండకు వెళ్లే వాహనాల నుంచి గేటు వసూలు చేసుకునేందుకు మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన వేలం పాటలకు విశేష స్పందన లభించింది. హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ హోదాలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ సోమవారం సాయంత్రం సబ్ కలెక్టరేట్‌లో వేలంపాటలు నిర్వహించారు. వేలంపాటల్లో పాల్గొనేందుకు తిరిగి చెల్లించని ధరావతు కింద రూ.2,000 రుసుమును అధికారులు నిర్ణయించారు. దీంతో 17 మంది వేలం పాటల్లో పాల్గొనేందుకు ఆసక్తి కనపరిచి డిపాజిట్ చెల్లించారు. వేలం పాటల ప్రారంభానికి ముందు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ ఇటీవల ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బెస్ట్ స్పాట్ ఫర్ షూటింగ్స్‌కు హార్సిలీహిల్స్ ఎంపికై, అవార్డును సొంతం చేసుకుందన్నారు. హార్సిలీహిల్స్ గేటు వసూళ్లకు సంబంధించి ఏడాది కాలపరిమితితో వేలం నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు ఉంటుందన్నారు. హార్సిలీహిల్స్‌కు వెళ్లేందుకు లీజు కండిషన్స్ ప్రకారం ద్విచక్రవాహనాలకు రూ.50, మూడుచక్రాల వాహనాలకు రూ.70, కారు, ఎల్ఎంవీ, నాలుగుచక్రాల వాహనాలకు రూ.100, బస్సు,లారీ, పెద్దవాహనాలకు రూ.200 మాత్రమే వసూలు చేయాలన్నారు. హార్సిలీహిల్స్ గేటు వసూళ్లకు సంబంధించి గత ఏడాది రూ.27,50,000 ఆదాయం రాగా, ఈ ఏడాది వేలం ప్రారంభ ధర రూ.30 లక్షలుగా నిర్ణయించామన్నారు. పోటాపోటీగా జరిగిన వేలం పాటల్లో అనిల్‌కుమార్ రూ.45లక్షల 20వేలకు పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో డీటీ అస్లాంబాషా, సిబ్బంది ఇమ్రాన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన యువకుడి మృతి



సాంబశివయ్య(ఫైల్)

రామాపురం : మండల పరిధిలోని సరస్వతిపల్లె గ్రామానికి చెందిన యనమల సాంబశివయ్య(30) పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. సాంబశివయ్య మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన భోజనపు లహరిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏడాది క్రితం రూ.80లక్షలు అప్పు చేసి తిరుపతిలో బేకరి ప్రారంభించాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. బేకరి వ్యాపారంలో నష్టపోవడంతో లహరి తల్లిదండ్రులు వివాహానికి ఇచ్చిన నగలు, డబ్బులు ఇవ్వాలని సాంబశివను అడిగారు. దీంతో మనస్తాపం చెంది గత నెల 24న మండలంలోని బండపల్లె గ్రామం కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని మన్నేరువాండ్లపల్లె పక్కన ఉన్న ఆర్బీ సమీపంలో పురుగుల మందు తాగాడు. కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..



మృతి చెందిన సూర్యనారాయణ

బి.కొత్తకోట : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. మండలంలోని బయ్యప్పగారిపల్లె గ్రామం గుట్టమీద హరిజనవాడకు చెందిన వెంకటరమణ, లక్ష్మి దంపతుల కుమారుడు సూర్యనారాయణ (25) మదనపల్లెలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను సోమవారం ఉదయం ఇంటిలో మృతి చెందాడు. ఇతని మృతికి పలువురు కారణమని పేర్కొంటూ తండ్రి వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూర్యనారాయణ ఓ యువతిని ప్రేమిస్తున్నాడని, దీని కారణంగా సెప్టెంబర్ 27న యువతి కుటుంబీకులతో గొడవ జరిగిందని తెలిపాడు. ఈ గొడవలో సూర్యనారాయణను అమరనారాయణ, జయరాం కొట్టిన దెబ్బలకు తాళలేక విషం తాగి చనిపోయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనం ఢీకొని..



మృతి చెందిన వృద్ధురాలు చిన్నక్క

గుర్రంకొండ : ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని అమిలేపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు అమిలేపల్లె పంచాయతీ ఎగువఅమిలేపల్లెకు చెందిన చిన్నక్క(75) అనే వృద్ధురాలు వాల్మీకిపురం-గుర్రంకొండ రోడ్డు మార్గం పక్కన పాడి ఆవులను మేపుకొంటోంది. ఆదివారం సాయంత్రం పాడి ఆవులను అక్కడే కట్టేసి రోడ్డు దాటుతుండగా గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్లపల్లెకు చెందిన చంద్ర అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ వృద్ధురాలిని ఢీకొన్నాడు. తలకు బలమైన గాయంకాగా స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నక్క సోమవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు..

మదనపల్లె : ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని దేవతానగర్‌లో నివాసమున్న కౌసర్‌అన్సారీ (52) పీటీఎం మండలంలోని కమ్మచెరువు పాఠశాలలో క్లర్క్‌గా పని చేస్తున్నాడు. సాయంత్రం విధులు ముగించుకుని స్కూటీ వాహనంలో వస్తుండగా తట్టివారిపల్లె వద్ద నీరుగట్టువారిపల్లెకు చెందిన యువకుడు సాంబశివ మరో ద్విచక్రవాహనంలో వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని బాలిక..



హర్షిత మృతదేహం

గాలివీడు : రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో హర్షిత(12) అనే బాలిక మృతి చెందిన విషాద ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం ఆంజనేయపురానికి చెందిన రమేష్ కుమార్తె హర్షిత ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని నాలుగు చక్రాల వాహనం ఢీ కొంది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ చిన్నారి మృత్యు ఒడిలోకి చేరుకుంది. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు.

పోలీసులు మందలించారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- రెండు రోజుల అనంతరం గుర్తించిన కుటుంబ సభ్యులు
- అదే రోజు భార్య సైతం ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డ్రైవర్ శంకర

మదనపల్లె : కుటుంబ సమస్యలతో భార్యాభర్తలు గొడవపడి, భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మందలించడంతో భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే రోజు భార్య సైతం ఆత్మహత్యకు యత్నించి తిరుపతిలో చికిత్స పొందుతోంది. కాగా ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న భర్తను అతని కుటుంబ సభ్యులు రెండు రోజుల అనంతరం గుర్తించి ఆస్పత్రికి తరలించిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. శివాజీనగర్‌లో నివాసమున్న శంకర (37) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య అమ్ములు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెప్టెంబర్ 27వతేదీన కుటుంబ సమస్యల కారణంగా భార్యాభర్తలు గొడవపడ్డారు. శంకర తన భార్య అమ్ములును కొట్టడంతో టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో టుటౌన్ పోలీసులు శంకరను పిలిపించి విచారించారు. అంతే కాకుండా మందలించారు. దీంతో మనస్తాపం చెందిన శంకర ఇంటికి వెళ్లి ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో తలుపులకు గడియ వేసుకుని ఉరి వేసుకున్నాడు. ఈ ప్రయత్నంలో మెడకు ఉరివేసిన తాడు తెగిపోవడంతో కిందపడి అపస్మారక స్థితిలో వెళ్లిపోయాడు. అదే రోజు భార్య అమ్ములు పుట్టింటికి వెళ్లి మనస్తాపం చెంది విషద్రావణం తాగింది. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. సోమవారం శంకర తల్లి కుమారుడికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించింది.అపస్మార స్థితిలో ఉన్న శంకరను స్థానికుల సహాయంతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించింది. పోలీసులు మందలించిన కారణంగానే తన కుమారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపింది. ఈ విషయమై టు టౌన్ సీఐని విచారించగా అమ్ములు ఫిర్యాదు మేరకు శంకరను స్టేషన్‌కు పిలిపించి విచారించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అంతేగాని టు టౌన్ పోలీసులు శంకరను కొట్టారన్న ఆరోపణలో వాస్తవం లేదన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647

PASSPORT LOST

I, Katri Raghavendra Rao, (Old Name) S/o Katari Baddaiah D/o W-09-391, Chemmuriapet, Kadapa City, YSR District-516003, A.P. here by change my name to Katari Raghavendra Rao (New Name) for all purposes.

WANTED

మైదుకూరులో పనిచేయుటకు టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్ హోటల్‌లో పనిచేయుటకు అనుభవం వున్న మాస్టర్ మరియు డ్రైవర్ కావలెను. జీతం: 8-16వేలు. సంప్ర: 63030 25110.

నెల్లూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీగార్డ్స్ / లేడీ గార్డ్స్. డ్యూటీ : 12గం॥ Qlf : 10th Pass / Fail. జీతం: 14,000/- ASOలు డ్యూటీ : 12 గం॥ జీతం: 16,000/- Qlf :ఇంటర్ అపై.Age : 20-45. ఫ్రీ రూం & మెస్ సౌకర్యం కలదు. వివరములకు సంప్రదించండి: 9959444086, 9490022205.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ. 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9182260297

మీ ఇంటి వద్దనే ఉండి మీ మొబైల్ ద్వారా మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500 సంపాదించుకోండి. వాట్సాప్‌లో hi మెసేజ్ చేసి వివరాలకు కాల్ 8247808801.

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692.

ప్రముఖ షాపింగ్ మాల్స్ and Cinema Theatres నందు వర్క్ చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) Supervisor కావలెను. సంప్ర: 9160152122, 9573871877, 8008869176.

గమనిక

సాక్షి / క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి: 97059 07418, 97059 44423 90102 23797, 90100 72409